క్లుప్తంగా

ఎస్ఆర్ఆర్‌లో తెలుగు భాషోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్):మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం తెలుగు భాషోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్యాపతి అధ్యక్షతన విద్యార్థులకు తెలుగు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్యాపతి తెలుగు భాష విశిష్టత ఔన్నత్యం గురించి వివరించారు. అనంతరం పోటీల్లో విజేతల తల్లులకు నూతన వస్త్రాలు అందించి నగదు బహుమతితో సత్కరించారు.

కండ్రికలో తాగునీటికి పరీక్షలు



పాయకాపురం(విజయవాడరూరల్):ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం కండ్రికలో తాగునీటి పరీక్షలను ఏఈ మాధవ్ నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు, కాశీమ్‌రోడ్డులో నీటి సరఫరా విధానం, తాగునీటికి సంబంధించి కార్పొరేటర్ కార్యాలయానికి ప్రజలు ఫిర్యాదు చేశారు. వెంటనే వీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అసిస్టెంటు ఇంజినీరు మాధవ్, స్థానికులతో కలిసి తాగునీటి శ్యాంపిల్స్‌ను సేకరించి వాటిని పరీక్ష చేశారు. ఎలాంటి తేడా లేదని ఏఈ తెలియచేశారు. స్థానికులు అనుమానం చెందాల్సిన అవసరం లేదన్నారు. క్లోరినేషన్ చేసిన తర్వాతే నీరు సరఫరా చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు యర్లగొర్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక సంగీతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ముత్యాలంపాడుకు చెందిన శ్రీవీణాధరి సంగీత శిక్షణాలయానికి చెందిన కళాకారులు పలు కీర్తనలు ఆలపించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై సుసర్ల నందిని శ్రీనివాస్ పర్యవేక్షణలో జి. రాజేశ్వరి పలు కీర్తనలు ఆలపించగా, ఎన్. తరుణి విశ్వనాథ సరవన్ మృదంగంపై చక్కటి సహకారం అందించారు. కళాకారులు ఆలపించిన భక్తిగీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకోగా, ఆలయ ఈవో కెఎస్.రామరావు వారి ప్రతిభను మెచ్చి ప్రశంసాపత్రాన్ని అందించారు. సంగీత ప్రదర్శన అనంతరం ఆలయ డెప్యూటీ ఈవో రత్నరాజు కళాకారులకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందచేయగా, ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.


పన్ను వేయించాలంటే.. వెన్ను వణకాల్సిందే !

- అవినీతి కూపంలో కూరుకుపోయిన కార్పొరేషన్ రెవెన్యూ విభాగం
- సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న బిల్‌కలెక్టర్లు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 'ఇంటి పన్ను వేయాలా... ఎన్ని గజాలు.. ఎన్ని ఫ్లోర్‌లు.. 100 గజాల లోపు అయితే రూ.30 వేలు అవుతుంది.. ఆపైన దాటితే ఫ్లోర్‌కు పాతికవేలు చొప్పున ఇవ్వాల్సిందే..' ఇదీ సింగ్‌నగర్, నందమూరినగర్, ఆంధ్రప్రభకాలనీ, ప్రకాష్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లోని కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న బిల్ కలెక్టర్లు, వారి కింద పనిచేస్తున్న వసూళ్ల రాజాలు అవలంభిస్తున్న అవినీతి తీరు. ఇక్కడి నగర శివారు ప్రాంతాల్లో కొత్తగా పెరుగుతున్న ఇల్లులు వీరికి కాసుల వర్షం కురిపిస్తున్నాయి. చివరికి ఇంటి స్థలాలకు వీఎల్‌టీ (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) వేయించాలన్నా.. ఇంటి పన్ను పేరు మార్చాలన్నా వారు అడిగినంతా ముట్టజెప్పాల్సి వస్తుంది.

ఇవిగో కొన్ని ఘటనలు....

- స్థానిక 58వ డివిజన్ ఇందిరానాయక్‌నగర్ అయ్యప్పస్వామి టెంపుల్ సమీపంలో ఓ యజమాని తనకున్న 189 గజాలలో నూతనంగా ఇంటిని నిర్మించుకునేందుకు ముందుకు వచ్చారు. దాని కోసం ఆయనకు ఇంటి పన్ను అవసరం కాగా ఆయన సంబంధిత అధికారులను సంప్రదించగా వారు ఏకంగా అక్షరాల లక్ష రూపాయలు డిమాండ్ చేశారు. దీంతో ఆయన బతిమాలి బతిమాలి వారితో వీరితో ఫోన్లు చేయించగా చివరకు రూ.60 వేలు తీసుకొని ఆ ఇంటికి పన్ను వేశారు.
- భారతమాతమందిరం రోడ్డులోని ఓ బిల్డర్ నిర్మించిన రెండు గృహాలకు ఇంటి పన్ను వేసేందుకు రూ.50 వేలు చొప్పున తీసుకున్నారు.



నందమూరినగర్ ప్రాంతం

- నందమూరినగర్‌లో మరో యజమాని ఓ 126 గజాల ఇంటికి పన్ను వేయాలని కోరగా వారు రూ.25 వేలు డిమాండ్ చేసి.. ఆ డబ్బులన్ని ఇచ్చిన తరువాత పన్ను వేశారు.
- తోటవారి వీధి 239 సచివాలయం పరిధిలోని 120 గజాలు ఉన్న స్థలానికి వీఎల్‌టీ పేరు మార్చాలంటే రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసి అతని దగ్గర నుంచి రూ.15 వేలు తీసుకొని పేరు మార్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ ప్రాంతంలో వారు ఇంటి పన్ను మార్చినవి.. పేరు మార్చిన ఫైళ్లన్ని ఇదే విధంగా వారు అడిగినన్ని డబ్బులు ఇచ్చాక మార్చినవేనంటే వీరి అవినీతి సామ్రాజ్యం ఏ విధంగా పెట్రేగుతుందో చెప్పకనే అర్థంపడుతుంది.

అడిగినంత ఇవ్వకపోతే... నెలలు గడిచినా ఫైల్ కదలదంతే...!

ఈ ప్రాంతాల్లో పనిచేస్తున్న బిల్ కలెక్టర్లకు పై అధికారులకు వాటాలు వెళ్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ఇక్కడి అధికారులు పన్ను వేయాలని వచ్చిన వారు పోలీసు అయినా,



సింగ్‌నగర్‌లోని పన్నుల వసూళ్ల కేంద్రం

ప్రభుత్వ అధికారి అయినా భయపడకుండా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. వారు అడిగినంత లంచం ఇవ్వకపోతే ఇక వారి ఫైలు గతి అంతే. నందమూరినగర్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ తన 126 గజాల గ్రౌండ్ ఫ్లోర్ ఇంటికి పన్ను వేయాలని కోరగా వారు రూ.25 వేలు డిమాండ్ చేశారు. అదేంటి నేనెందుకు డబ్బులు.. అవినీతిని నేను ప్రోత్సహించనని తెగేసి తెలిపాడు. దీంతో అతని ఫైల్ గత మూడు నెలల నుంచి అక్కడే ఆగిపోయింది. అదేమని అడిగితే ఆ కాగితం కావాలి, ఈ కాగితం కావాలని కొన్ని రోజులు తిప్పారు. మరికొన్ని రోజులు కమిషనర్ సంతకం కావాలి.. వరదలు ఆ పేపర్లు కనిపించడం లేదని నోటికొచ్చినట్లు చెప్పి తమ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. ఇలా డబ్బులు ఇవ్వని వారందరినీ ఇదే విధంగా పనిచేయకుండా తిప్పుకుంటారని కొంతమంది బాధితులు ఆరోపిస్తున్నారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కమిషనర్‌కు కూడా కమీషన్లు ఇవ్వాలి..!

బిల్ కలెక్టర్లు అడిగిన డబ్బుల గురించి బాధితులు నోర్లు వెళ్లబెడుతున్నారు. అదేమని అడిగితే ఈ డబ్బులన్నీ మేమొక్కళ్లమే తింటామనుకుంటున్నారా.. మీ ఫైల్ అప్రూవ్ అవ్వాలంటే ఆఫీస్ సిబ్బందికి, బిల్‌కలెక్టర్‌కు, ఆర్ఐకు, అసిస్టెంట్ కమిషనర్‌కు, కార్పొరేషన్ కమిషనర్‌కు సైతం వాటాలు ఇవ్వాలని చెప్పి మరీ వసూళ్లు చేయడం కొసమెరుపు.

తూతూ మంత్రంగా చర్యలు.....

గతంలో నందమూరినగర్‌లో పనిచేసిన ఓ మహిళా అధికారిపై కూడా ఇదే విధంగా ఫిర్యాదులు, ఆరోపణలు వచ్చాయి. దీంతో పై అధికారులు ఆమెపై తూతూ మంత్రంగా చర్యలు తీసుకొని చేతులు దులుపుకున్నారు. దీంతో మిగిలిన అధికారులు కూడా ఆ మాకు కూడా ఏమి కాదులే.. మా పైన అధికారులు చూసుకుంటారని భావించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. సింగ్‌నగర్, పాయకాపురం, నందమూరినగర్, న్యూఆర్ఆర్‌పేట, వాంబేకాలనీ, ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారుల్లో చాలామంది ఐదేళ్ల పైనుంచి ఇక్కడే పాతుకుపోయారు. దీంతో వారు ఆడిందే ఆట.. చెప్పిందే మాటగా సాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు రెవిన్యూ విభాగంలో జరుగుతున్న అవినీతిపై దృష్టిసారించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

షూటర్ అక్షయకు ప్రశంసలు



మధురానగర్(విజయవాడసెంట్రల్):ఇటీవల రాజమండ్రి లో జరిగిన ఏపీ స్టేట్ 68వ స్కూల్ గేమ్స్ అండర్ 17 బాలికల 10 మీటర్ల రైఫిల్ పిస్టిట్ విభాగంలో ఎస్ఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థి అద్భుతమైన ప్రతిభ కనుబరచి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి అక్షయను కళాశాల నన్సిపాల్ మధుకర్ రెడ్డి అభినందించారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్):కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని చేయూత సంస్థ అధ్యక్షురాలు పి.లక్ష్మీతులసి సూచించారు. మధురానగర్ వీవీన రసరాజు రోడ్డులోని చేయూత సంస్థ కార్యాలయంలో సోమవారం పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్ట భద్రులు అందరూ ఓటరుగా నమోదు చేయించుకునేందుకు గానూ తాము తమ వంతు సహాయ సహకారం అందజేస్తున్నామన్నారు. ఓటు నమోదు చేయించుకోదలచిన వారు డిగ్రీ ప్రొవిజనల్, ఆధార్ నకలు, పాస్‌పోర్టుసైజు ఫొటో, ఓటర్ ఐడీ నకలుతో తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్ఎన్‌పురం పోలీసులు సోమవారం పెజ్జోనిపేటలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు షబ్బీర్, రామకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్‌లు వాడే వారే ఎక్కువగా సైబర్ నేరాలకు గురవుతున్నారని వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు రకరకాల ప్రలోభాలకు గురిచేసి నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఈ సైబర్ నేరాల పట్ల కొద్ది పాటి అవగాహన కలిగి ఉంటే వాటికి దూరంగా ఉండవచ్చని సూచించారు. ముఖ్యంగా అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి ఫోన్‌లలో వారు అడిగిన వివరాలు వెల్లడించడం, లోన్స్ యాప్స్, బ్యాంకుల నుంచే మొబైల్ ఫోన్‌లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయడం ద్వారా సైబర్ నేరగాళ్లు తమ బ్యాంకు ఖాతాలోని నగదు మాయం



పెజ్జోనిపేటలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ షబ్బీర్

చేస్తారని హెచ్చరించారు. అలాగే శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తమ నివాసాల పరిసర ప్రాంతాలలో అనుమానిత వ్యక్తులు తిరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో శివుడికి అన్నాభిషేకం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా 57వ డివిజన్ అమరావతికాలనీలో ప్రత్యేక పూజలు జరిగాయి. గణపతి దేవస్థానంలో ఉన్న శివ పంచాయతన క్షేత్రంలో శివుడికి అత్యంత ప్రీతికరమైన అన్నాభిషేకం భక్తి శ్రద్ధలతో చేశారు. కాలనీ కమిటీ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం జరిగిన దీపోత్సవం కనుల పండువగా జరిగింది. యువతులు, మహిళలు పాల్గొని శివలింగం ఆకారంలో దీపాలను వెలగించారు.



అన్నాభిషేకం చేస్తున్న అర్చకులు



దీపాలు వెలిగిస్తున్న మహిళా భక్తులు



మధురానగర్ శ్రీ ఉభయరామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో



ముత్యాలంపాడులోని పార్వతీ సమేతరామలింగేశ్వరస్వామి



బాబా మందిరంలో అభిషేకం చేస్తున్న భక్తులు



అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో స్వామి

భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు

కిటకిటలాడిన దేవాలయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్తీక సోమవారం సందర్భంగా మధురానగర్, ముత్యాలంపాడు, అయోధ్యనగర్ తదితర ప్రాంతాలలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారికి ప్రీతికరమైన కార్తీక మాసం సోమవారం కావటంతో తెల్లవారు జాము నుంచే ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. మహిళలు పెద్దసంఖ్యలో ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలలో దీపారాధనలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముత్యాలంపాడులోని పార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష అర్చనలు, పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రుద్రాక్షలతో స్వామివారికి పూజలు చేసి అలంకారం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు దాట్ల వెంకట నరసింహరాజు, మండలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు. అయోధ్యనగర్‌లోని దత్తసాయి



ముత్యాలంపాడులో భక్తులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

శివకామేశ్వరీ పీఠం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. పరమ శివునికి అత్యంత ప్రీతికరమైన మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకంను ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు ఆలయంలో దీపారాధనలు చేశారు. కార్యక్రమాలను శ్రీధర్మపరిషత్ వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ (రాజా) పర్యవేక్షించారు. మధురానగర్ పప్పులమిల్లు రైల్వేగేటు సమీపంలోని ఉభయ రామలింగేశ్వరస్వామి వారి దేవాలయంలో స్వాములు పెద్దసంఖ్యలో పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారికి విశేషంగా అలంకారం చేసి పూజలు చేశారు. ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శ్రీ భవానీ శంకర మరకత పోలిక శివలింగంకు భక్తులు స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



వన్‌టౌన్ పాతశివాలయం వద్ద శివయ్యను దర్శించుకునేందుకు క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు



కృష్ణానదిలో తెల్లవారుజామునే పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



పాతశివాలయం వద్ద శివలింగంకు అభిషేకం చేస్తున్న అర్చకులు

పరమ పవిత్రం కార్తిక దీపం

కార్తికమాసం తొలి సోమవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి పరమ పవిత్రంగా భావించే కార్తిక దీపాలు వెలిగించారు. ఆయా ప్రాంతాల్లోని శివాలయాల్లో స్వామిని దర్శించుకున్నారు. విజయవాడలోని అన్ని ప్రాంతాల్లో శైవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు నిర్వహించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



అరటి దొప్పల్లో దీపాలు వెలిగిస్తున్న యువతులు



భవానీపురం పున్నమిఘాట్ వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):ఎవరైనా రోడ్లు, ఫుట్‌పాత్‌లతో పాటు మున్సిపల్ స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీసీపీ జి.రామకృష్ణ పేర్కొన్నారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణవీధి, కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్ పరిసరాల్లో రామకృష్ణ, కొత్తపేట సీఐ చిన్న కొండలరావు, పోలీసు సిబ్బంది స్ట్రీట్‌వాక్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారికి సూచనలు ఇచ్చారు. పాదచారులకు, వాహనచోదకులకు ఇబ్బంది కలిగించే విధంగా ఎవరు వ్యవహరించినా చర్యలు తప్పవని తెలిపారు. పోలీసు సూచనలు పట్టించుకోకుండా వ్యాపారాలు సాగిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీ మెయిన్‌డ్రా కు 46 మంది అర్హత

విజయవాడస్పోర్ట్స్:కాసా వడ్లమూడి మోహన్ కృష్ణ మెమోరియల్ రాష్ట్ర స్థాయి అండర్–13 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో 46 మంది క్రీడాకారులు మెయిన్ డ్రా కు చేరారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన క్యాలిఫయింగ్ మ్యాచ్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 250 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. సింగిల్స్‌లో మూడు, డబుల్స్‌లో రెండు రౌండ్ల పాటు హోరాహోరీగా మ్యాచ్‌లు జరిగాయి. ఈ మ్యాచ్‌ల బాలికల సింగిల్స్‌లో 16, బాలుర సింగిల్స్‌లో 16, బాలుర డబుల్స్‌లో 8, బాలికల డబుల్స్‌లో 6 మంది నేటి నుంచి జరిగే మెయిన్ డ్రా మ్యాచ్‌లకు అర్హత సాధించారు. నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే మెయిన్ డ్రా మ్యాచ్‌లలో వీరంతా తలపడతారు. మంగళవారం ప్రారంభమయ్యే మెయిన్ డ్రా మ్యాచ్‌లను క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభిస్తారని ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ పి.అంకమ్మచౌదరి ప్రకటించారు.



క్యాలిఫయింగ్ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

సమస్యలకు సత్వర పరిష్కారమే ధ్యేయం

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలను నిత్యం పరిష్కరించే దిశగా జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం ఉండాలని వీఎంసీ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ఆయన నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 14 ఫిర్యాదులు అందుకున్నారు. అందులో పట్టణ ప్రణాళిక విభాగంపై–5, ప్రజారోగ్యంపై– 2, ఇంజినీరింగ్‌పై– 2, రెవెన్యూ విభాగం–3, ఎస్టేట్ విభాగంపై ఒకటి, వరదల సంబంధిత ఫిర్యాదులను అధికారులు అందుకున్నారు. డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సుపరింటెండెంటగ్ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి సత్య కుమారి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, డీఎఫ్ఓ మాల్యాద్రి, ఎస్టేట్ ఆఫీసర్ టీ శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్ సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్